


# ఋణం

— పల్లేటి బాలాజీ

బేగంపేట విమానాశ్రయం చాలా హడావిడిగా వుంది. విమానం లాండయినట్లు అనౌన్స్‌మెంట్ వినిపించడంతో హడావిడి మరీ పెరిగిపోయింది. విదేశీ పర్యన ముగించుకొని వచ్చిన కేంద్ర మంత్రి గారు సతీసమేతంగాఆ విమానంలోంచి దిగారు. అది చూసిన ఆయన అనుచరగణం ఎంతో ఆర్భాటంగా జేజేలు కొట్టసాగారు. మంత్రిగారి వెనకనే విమానం దిగిన గోపీకృష్ణకు ఇదంతా చాలా వింతగా అనిపించింది. అమెరికా విమానాశ్రయాల్లో ఇలాంటి జేజేలు అతడెప్పుడూ వినలేదు.

మంత్రిగారి దంపతుల్ని కొందరు పూలమాలల్తో ముంచెత్తుతుంటే, ఇంకొందరు ఎంతో ఖరీదైన పూల బొకేలతో ఆహ్వానిస్తున్నారు.

వారందరి దగ్గర ధన మదం స్పష్టంగా కనిపిస్తోంది.

కాలిజోళ్ళ దగ్గర నుంచి కళ్ళజోళ్ళ వరకూ ఎంతో ఖరీదైన వస్తువుల్ని ధరించిన ఓ ప్రముఖ సినీనటి తనకంటే ఎంతో అందంగా అలంకరించిన పూల బొకేల్ని మంత్రిగారి దంపతులకిచ్చి తెచ్చిపెట్టుకున్న చిరునవ్వుతో వారిని ఆహ్వానించింది. ఆ సినీ నటి తన పరిసరాలంతా కూడా డబ్బు పరిమళం వెదజల్లుతోంది.

మంత్రిగారి దంపతులు విమానాశ్రయంలోంచి బయటపడ్డంతో...

అప్పటివరకు ఎంతో హడావిడిని, రాజకీయ కంపుని, సినీ తళుకుల్ని భరించిన అధునాతన సౌకర్యాలు కలిగిన ఆ విమానాశ్రయాన్ని కొద్ది క్షణాలు నిశ్శబ్దం ఆవరించినట్టు అనిపించింది గోపీకృష్ణకు.

ఎన్నో ఆధునాతన సౌకర్యాలకు అలవాటుపడ్డ గోపీకృష్ణకు ఇవన్నీ ప్రతిబంధకాలుగా అనిపించడంతో అక్కడ కొద్ది క్షణాలు కూడా కూర్చో లేక హడావిడిగా సెక్యూరిటీ చెక్ ముగించుకొని విమానాశ్రయంలోంచి బయటపడ్డాడు.

ఏ ప్రభువుకైనా పల్లకీ మోయడానికి బోయలు అవసరమన్నట్లు కొంతమంది యువకులు ప్లేకార్డ్స్ చేతిలో పట్టుకొని నిలబడి వున్నారు. కొన్ని ప్లేకార్డ్స్ వ్యక్తుల పేర్లతో, మరికొన్ని కంపెనీల పేర్లతో వున్నాయి.

తన పేరున్న ప్లేకార్డ్ చేతబట్టుకున్న కుర్రాడి వంక చూశాడు గోపీకృష్ణ.

ఆ చూపులు తన చేతిలో వున్న పేరు గల వ్యక్తి కోసం అన్వేషిస్తున్నాయి.

"నేనే గోపీకృష్ణను" ఆ కుర్రాడితో చెప్పాడు.

"రండి సార్... నేను సంగీతా ట్రావెల్స్ నుంచి వచ్చాను" అంటూ ఎంతో ఖరీదైన ఓ విదేశీ కారు దగ్గరకు గోపీకృష్ణను తీసుకెళ్ళాడా కుర్రాడు.

ఎక్కిన తర్వాత నిశ్శబ్దంగా కదిలిందా ఖరీదైన కారు.

ఎంతో నైపుణ్యంగా కారు నడుపుతున్న ఆ కుర్రాడ్ని చూస్తుంటే తన కొడుకు రవిదీప్ గుర్తొచ్చాడు గోపీకృష్ణకు.

ఎందుకో అతడితో మాట్లాడాలనిపించిందతడికి.

"బాబూ... నీ పేరేంటి?"

"కృష్ణకుమార్ సార్!"

"ఏం చదువుకున్నావ్?"

"బి.ఎ. చదివాను."

"డిగ్రీ చదివి ట్రావెల్ ఏజెన్సీలో ఈ ఉద్యోగం చేస్తున్నావా?" ఎంతో ఆశ్చర్యంగా అడిగాడు.

"నాదేంటి సార్ కేవలం డిగ్రీ. పోస్ట్‌గ్రాడ్యుయేట్ చేసినవాళ్ళు కూడా ఉద్యోగాల్లేకుండా వున్నారు. నేను కాబట్టి ఈ ఉద్యోగం సంపాదించాను."

"ఈ ఉద్యోగం నీకు తృప్తినిస్తోందా?"

"ఈ ఉద్యోగానికేం సార్...!"

ఇలాంటి ఖరీదైన విదేశీ కార్లో కూర్చోగల ఆర్థిక స్థోమత, అర్హత లేకపోయినా ఆ కుర్రాడి కళ్ళలో ఈ ప్రపంచాన్ని జయించగలనన్న ధీమా ఎంతో స్పష్టంగా కనిపిస్తోంది. ఇలాంటి ధీమా ఆ వయసులో నా కళ్ళలోనూ వుండేది. మరి ఇప్పుడో... ఆలోచనలు గోపీకృష్ణను దాదాపు పాతికేళ్ళు వెనక్కు తీసుకెళ్ళాయి.

గోపీకృష్ణ, రామచంద్రయ్యలు ప్రాణస్నేహితులు.

వారిద్దరికీ ఏ విషయంలోనూ ఎప్పుడూ మనస్పర్థలు రాలేదు.

కానీ ఓ రోజు...

"రాముడూ..! గుడ్ న్యూస్ రా!" ఎంతో సంతోషంగా చెప్పాడు గోపీకృష్ణ.

"ఏమిటిరా ఆ గుడ్ న్యూస్?" ఆతృతగా అడిగారు రామచంద్రయ్య.

"పెళ్ళి సంబంధం వచ్చిందిరా" సిగ్గుపడుతూ చెప్పాడు.

"పెళ్ళి సంబంధం వచ్చిందని చెప్పేటప్పుడు సిగ్గుపడాల్సింది పెళ్ళి కూతురు కాబోయే అమ్మాయిరా... మరి నువ్వెందుకు సిగ్గుపడుతున్నావో..."

"అది కాదురా..."

"అదికాదు, ఇది కాదంటూ కాలయాపన చేయకుండా – అమ్మాయెవరు? ఏం చదివింది? ఎలా వుంటుందో టకటక మంటూ సూటిగా చెప్పేయ్‌రా బాబూ...!"

"అమ్మాయిది అమెరికా..." ఇంకా ఏదో చెప్పబోతున్న అతడ్ని అడ్డుకుంటూ

"అమెరికా అమ్మాయా?" ఎంతో ఆశ్చర్యపోతూ అడిగారు రామచంద్రయ్య.

"అవునురా...కాకపోతే అమెరికా అంటే అమెరికా కాదు. వాళ్ళ అమ్మా నాన్నలిద్దరూ మన ఆంధ్రావాళ్ళే. చాలా ఏళ్ళక్రితమే ఉద్యోగరీత్యా అమెరికా వెళ్ళిపోవడంవల్ల న్యూయార్క్‌లో స్థిరపడిపోయారు"

"అంటే ఆ అమ్మాయి అక్కడే పుట్టి పెరిగిందన్నమాట"

"అవును." తలవంచుకుని చెప్పాడు.

"మన సంస్కృతి మన వాతావరణంలో పెరిగిన అమ్మాయిని చేసుకోకుండా ఎక్కడో విదేశీ వాతావరణంలో పెరిగిన అమ్మాయెందుకురా?"

"నాకు ఇంకా పై చదువులు చదవాలని వుందిరా.. అందుకని.."

"అందుకని అమెరికా సంబంధం చేసుకుంటావా?"

"ఆ అమ్మాయిని చేసుకుంటే వీసా ఇప్పించడం దగ్గరనుంచి హయ్యర్ స్టడీస్‌కి స్పాన్సర్ చేయడం వరకు అన్నీ ఆ అమ్మాయి తండ్రే చూసుకుంటానన్నాడు".

"గోపీ! ఎలిమెంటరీ స్కూలు నుంచి డాక్టరేట్ వరకు నీ స్వశక్తితోనే చదివావుకదరా.. అలాంటి నువ్వు ఇలా పెళ్ళి పై చదువులు చదవాలనుకోవడం నాకెందుకో నచ్చడంలేదు." కొంచెం బాధతో చెప్పాడు.

అతడి బాధలో తను అమెరికా వెళ్ళి పై చదువులు చదవడంలో అయిష్టత లేదని గోపీకృష్ణకు తెలుసు. కానీ ఏం మాట్లాడాలో తెలియక–

"నీకే ఇలాంటి అవకాశం వస్తే వదులుకుంటావా?" అనడిగాడు.

తన జీవితాశయం ఏమిటో తెలిసిన గోపీకృష్ణే ఇలాంటి ప్రశ్న అడుగుతాడని రామచంద్రయ్య ఊహించలేదు.

(మిగతా వచ్చేవారం)


అతి త్వరలో
గడులూ మడులూ....!
నిర్వహణ:
యామినీ సరస్వతి